ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : సద్గురు శ్రీ నాన్నగారు

సంపుటి : 10    సంచిక : 18    పుష్పం : 37-38    05-06-2005

రమణ భాస్కర

ఆధ్యాత్మిక పక్ష పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥100/-

విడి ప్రతి : రూ॥ 8/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551

ఈ సంచికలో....

10-02-05

భీమవరం ................. 1

02-03-05

సఖినేటిపల్లి ............... 9

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, ☎ 08814 - 228858

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 10-02-05, భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

అనేకమంది మంచి పనులు చేస్తూ ఉంటారు. అన్ని పనులు మనం చేయలేకపోవచ్చును. కనీసం చూసి ఆనందించటం నేర్చుకుంటే కొంత దైవానుగ్రహానికి మనం పాత్రులమవుతాము. ఎవరైనా మంచి పని చేసేటప్పుడు మనం ప్రోత్సహిస్తాము అనుకోండి, అలా ప్రోత్సహించినందుకు కూడా కొన్ని మార్కులు మనకు భగవంతుడు ఇస్తాడు. పూర్వం ఎక్కువ డబ్బు రాళ్ళకు, రప్పలకు ఖర్చు పెట్టేవారు కాని ఇప్పుడు అలాకాదు, దైనందినజీవితంలో అందరికీ ఉపయోగపడే పనులు చేయటం నేర్చుకొంటున్నారు, ఇది మంచి పద్ధతి. కర్మను యోగంగా చేస్తే వారికి మోక్షం వస్తుంది. కోరికతో కర్మ చేస్తే సంసారం వస్తుంది, కోరిక లేకుండా కర్మ చేస్తే మోక్షం వస్తుంది. ధర్మాన్ని మనస్సులో పెట్టుకొని కర్మ చేస్తే శాంతి కలుగుతుంది, జ్ఞానం కలుగుతుంది. మనం చిన్నపని అయినా పెద్దమనస్సుతో చెయ్యాలి, నిండుమనస్సుతో హృదయపూర్వకంగా చెయ్యాలి. భగవంతుడికి చిన్నపని అని, పెద్దపని అనిలేదు, ఆ పని చేసేటప్పుడు మీ మనస్సు ఎలాఉంది అని చూస్తాడు. మనం కర్మ మార్గంలో ప్రయాణం చేసినా, జ్ఞానమార్గంలో ప్రయాణం చేసినా ఏ మార్గంలో ప్రయాణం చేసినా ఈ దేహంతో తాదాత్మ్యం పొందే బుద్ధిని వదిలించుకోవాలి, ఆధ్యాత్మిక రహస్యం అంతా కూడా ఇక్కడే ఉంది. దేహంతో తాదాత్మ్యం ప్రారంభమయ్యిందా మనకు అన్ని అరిష్టాలు, అన్ని ఇబ్బందులూ వస్తాయి, పునర్జన్మలు వస్తాయి, అశాంతి కలుగుతుంది. దేహభావన ఎప్పుడైతే ప్రారంభమయ్యిందో అప్పుడు గౌరవాలు కోరుకొంటాము, అంతస్థులు కోరుకొంటాము, ఏదో ఒకటి కోరుకొంటూనే

ఉంటాము. నిజంగా దేహం నేను అయితే దేహంతో తాదాత్మ్యం నాకు ఉన్నా ఇబ్బంది లేదు. దేహంతో తాదాత్మ్యం పొందే బుద్ధినే భ్రమ అంటారు. బ్రహ్మజ్ఞానం కలిగేవరకూ ఎంతటి వారికైనా ఈ భ్రమ విడిచిపెట్టదు. మనం ఎత్తైన మేడమీద నుండి చూసినప్పుడు కింద వెళ్ళే మనుషులు ఎలా కనిపిస్తారో ఆధ్యాత్మిక అంతస్థు పొందినవాడికి ఈ ప్రపంచంలో ఉన్న సంపదలు, గౌరవాలు అన్నీ అలాగే కనిపిస్తాయి. మనం కోరిక లేకుండా పనిచేస్తూ ఉంటే మనవలన సమాజం బాగుపడినా, బాగుపడకపోయినా మనకు ఎంతోకొంత చైతన్యస్థాయి పెరుగుతుంది. మనం రాబోయే విషయాల మీద ఆసక్తి పెట్టుకోకూడదు, జరిగిపోయిన గొడవల గురించి బెంగపెట్టుకోకూడదు. ఉపనిషత్తులలో ఒక మాట ఉంది మనం పూర్వ జన్మలలో ఏదైనా దోషాలు చేసి ఉంటే, ధర్మవిరుద్ధంగా ప్రవర్తించి ఉంటే ఆ పాపఫలితం రెండు రకాలుగా వస్తుంది. శరీరానికి రోగం వస్తుంది, మనస్సుకు శోఖం వస్తుంది లేకపోతే రెండూ వస్తాయి, అది పాపఫలితం అని చెప్పారు. కర్మను నీవు ధర్మబద్ధంగా ఆచరిస్తే అది నీకు ఆత్మజ్ఞానాన్ని ప్రసాదిస్తుంది, దానివలన వివేకం కలుగుతుంది, విచక్షణ కలుగుతుంది. ఏది సత్యం, ఏది అసత్యం అని వేరుచేసుకొనే బుద్ధి మనకు ఎప్పుడయితే కలుగుతోందో అప్పుడు ఆడంబరవిషయాలను, ఆడంబరమాటలను, ఆడంబరంగా ప్రవర్తించే వారిని తీసి ఒక ప్రక్కన పెడతాము. ఆడంబరంగా ప్రవర్తించే వారి మాటలు మనం వింటూ ఉంటే, ఆ మాట నిజం అనుకొంటే మనం మోసపోతాము. మన మాటలో, చేతలో, వేషధారణలో ఆడంబరం ఉండకూడదు. మన మాట నిరహంకారంగా ఉండాలి. అవసరమయితే మాట్లాడాలి, అవసరం లేకపోతే మాట్లాడకూడదు. ఏకాంతవాసం అలవాటు చేసుకో. లోక విషయాలను జుర్రుకోవటం కంటే పరమాత్మలో శాంతిని పొందటం నేర్చుకో అని ఉపనిషత్ చెపుతుంది. ఎక్కడ దొరుకుతుందా మేత అని మనం ఎంతసేపు చూస్తూ ఉంటాము. మన సంతోషం కోసం వస్తువుల మీదో, మనుషులమీదో, లోకంలో జరిగే సంఘటనల మీదో ఆధారపడి ఉంటాము. ఇదంతా ఎప్పటికయినా శోకం కింద మారిపోతుంది. ఒక్క ఆత్మ సుఖం మాత్రమే స్వతంత్రమైనది. తిండి దగ్గర జాగ్రత్తగా ఉండాలి, మాట హితవుగా ఉండాలి, సజ్జనసాంగత్యం అవసరం, ఏకాంతవాసం చేయాలి. ఇలా నియమబద్ధంగా జీవిస్తూ ఉంటే మోక్షం దగ్గరకు మనం వెళ్ళటం కాదు, మోక్షమే మన దగ్గరకు వస్తుంది. దేహవాసన, లోకవాసన ఇదంతా భ్రమ. మన హృదయంలో ఉన్న సద్వస్తువు ఉన్నది ఉన్నట్లుగా మనకు వ్యక్తమయ్యేవరకు ఈ భ్రమలో నుండి బయటకు రాలేము. మనం జ్ఞానం గురించి శ్రవణం చెయ్యాలి, మననం చెయ్యాలి, ఆత్మ గురించి చింతించాలి. ఆత్మ చింతన లేకుండా మనకు ఆత్మజ్ఞానం కలుగదు. మన హృదయంలో ఆత్మ ఉంది అంటే ఏమీ ప్రయోజనం లేదు దాని తాలూక అనుభవం మనకు కలగాలి. ఊరికే అనుభవం రావాలి అని అనుకొంటే అనుభవం

రాదు, శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవిస్తే అది అనుభవంలోనికి వస్తుంది. మన మనస్సును, ఇంద్రియాలను, దేహాన్ని ప్రమాణంగా పెట్టుకొంటున్నాము కాని మనం భగవంతుడు చెప్పిన వాక్యాలను ప్రమాణంగా పెట్టుకోవటం లేదు. భగవంతుడు చెప్పిన వాక్యాన్ని శ్రవణం చేసి, దానిని అర్థం చేసుకొని, దానిని అనుభవించి నీవు ఎంజాయ్ చేయగలుగుతూ ఉంటే అలా చెయ్యగా చెయ్యగా నీకు భగవదనుభవం కలుగుతుంది. నువ్వు శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవిస్తే నీలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడు నీకు గోచరిస్తాడు, అది నీ కడసారి జన్మ.

ఈ సృష్టికి మీకు, నాకు, ఈ ప్రపంచానికి ఏ చైతన్యం అయితే ఆధారంగా ఉందో ఆ చైతన్యం మనకు అనుభవంలోనికి వచ్చేవరకు ఈ ప్రకృతి మనలను విడిచిపెట్టదు. ఆచార్యుల వారు ఏమి చెప్పారు అంటే ఈ ప్రకృతి అంతా చైతన్యంలో నుండే వచ్చింది. చైతన్యం నిజమే, కాని చైతన్యంలో నుండి వచ్చిన ఈ ప్రకృతి మటుకు నిజంకాదు అన్నారు. మనకు చనిపోవాలని ఉండదు, ఎప్పడూ ఉండాలనే ఉంటుంది, ఆ ఉండటమే భగవంతుడు. మనకు అందరికంటే మనం అంటేనే మనకు ఎక్కువ ఇష్టం. ఎందుచేతనంటే భగవంతుడి యొక్క అంశ మనలో ఉంది, లోపల ఏ అంశ అయితే ఉందో అదంటేనే మనకు ఇష్టం. మనం ప్రేమించదగినవాడు, మనం సాధనచేసి పొందదగినవాడు ఈశ్వరుడు ఒక్కడే. మనకు ఏదైనా కోరికలు ఉంటే నెరవేర్చువాడు ఆయనే. మనం భగవంతుని ప్రార్థించటం, స్మరించటం, ధ్యానించటం నేర్చుకోవాలి. ఇలా నేర్చుకొంటూ ఉంటే మనకు బంగారంలాంటి మనస్సు ఇస్తాడు. రాగద్వేషరహితుడు మాత్రమే బ్రహ్మజ్ఞానానికి అర్హుడు, వాడే యోగ్యుడు అని మనం గీతలో చదువుతున్నాము. కాని రాగద్వేషరహితస్థితిని పొందటం మనం నోటితో చెపుకున్నంత తేలికకాదు. రాగ ద్వేషరహితస్థితిని పొందటానికి మన తెలివితేటలు సరిపోవు, మన కృషి సరిపోదు, భగవంతుడిని ప్రార్థించాలి, ఆయన దయ వలననే రాగద్వేషాలు పోతాయి. ద్వేషం ఎంత బంధకారణమో రాగం కూడా అంతే బంధకారణం. రాగం బంగారపు సంకెళ్ళు అయితే, ద్వేషం ఇనుప సంకెళ్ళు. మనం భగవంతుడిని ప్రార్థించాలి, అప్పడు మన అవసరాలు ఏమిటో ఆయనే చూస్తాడు. అంతేగాని అది కావాలి, ఇది కావాలి అని ఆయనను ఏమీ అడగకూడదు. ఇక్కడ మన కోరిక నెరవేరిందా, లేదా అనేది ముఖ్యంకాదు. మనం క్రమపద్ధతిలో నియమబద్ధంగా భగవంతుడిని ప్రార్థిస్తున్నామా, లేదా అనేది మనం చూసుకోవాలి. మనం భగవంతుడిని ప్రార్థించాలి. ఆయన ఫలితాన్ని ఇస్తాడు లేకపోతే ఇవ్వడు అది మనకు అనవసరం. ఇచ్చినప్పడు ఎందుకు ఇచ్చాడో, ఇవ్వనప్పడు ఎందుకు ఇవ్వలేదో మనకు తెలియదు, ఒకోసారి మన క్షేమం కోరి అది ఇవ్వడు. ఈ విశాలమైన ఖగోళంలో మన బుద్ధి ఎంత? మన తెలివి తేటలు ఎంత? వాటిని చూసి మిడిసిపడి

పోతున్నాము. మాయ ఎలా ఉంటుందో ఒకసారి పరమహంసగారు చెప్పారు. మీరు ఎక్కువ విలువ గల చీరను కట్టుకొని, నాలుగు నగలు మెడలో వేసుకొని, మీ దగ్గర పర్సునిండా డబ్బు ఉంటే ఈ ప్రపంచంలో మనంతటి వారులేరు అనిపిస్తుందట, ఆ బట్ట, బంగారం, డబ్బు అలా చేయిస్తాయట. నిజంగా మనకు ధనం ఉన్నా ఇండియాలో ఉన్న ధనవంతులతో పోల్చుకుంటే మనకు ఉన్న ధనం ఏపాటిది. మనకు జ్ఞానం ఎప్పుడు ఇవ్వాలి అనేది ఆ ముహూర్తం ఆయన పెట్టుకొంటాడు ఈలోపుగా మన డ్యూటీ మనం క్రమంగా చేసుకొంటూ వెళ్ళాలి. మనం ఒక మనిషి కోసంకాని, వస్తువుకోసంగాని, సంపదకోసంగాని, అధికారం కోసంగాని ఎదురుచూడము అనుకోండి, ఈ లోకంలో ఏమీ ఆశించం అనుకోండి అప్పుడు మన హృదయం శాంతితో నిండిపోతుంది. ఇవి అన్నీ స్వప్న సమానం కాబట్టి వాటి గురించి బెంగ పెట్టుకొని, అశాంతి తెచ్చుకొని నీ తలకాయను పాడుచేసుకోవద్దు. నీవు శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకో, భగవంతుడు ఏమి చెప్పాడో చూసుకొంటూ ఉండు, దాని ప్రకారం జీవించు, అప్పుడు పరిస్థితులు చక్కబడతాయి, నీకు ఇహం ఉంటుంది, పరం ఉంటుంది. భగవంతుడు చెప్పినట్లుగా మనం జీవిస్తూ ఉంటే మనకు భయం తగ్గిపోతుంది, మనకు ఆత్మవిశ్వాసం కలుగుతుంది. ప్రపంచవిషయాలలో మనం ఎంతవరకు ఉండాలో అంత వరకే ఉండాలి, అతిగా ఉండకూడదు, ఇతరుల విషయాలలో అనవసరంగా జోక్యం చేసుకోవద్దు. ఇతరుల విషయాలలో జోక్యం చేసుకోవటం వలన అహంభావన పెరుగుతుంది. నువ్వు ఏదైనా మంచి పనిచేసినా, చేసి మర్చిపో అంతేగాని శిరస్సుమీద మొయ్యకు. నువ్వు మర్చిపోయావని భగవంతుడు మర్చిపోడు. నువ్వు చేసిన పని యొక్క ఫలితం ఆయనకు అక్కరలేదు. ఎందుచేతనంటే ఆయన పూర్ణకాముడు అంటే నెరవేరవలసిన కోరిక అంటూ ఏమీ ఆయనకు లేదు. భగవంతుడిని ప్రార్థిస్తూ ఉంటే మనకు ఉన్న ఇష్టాలు, అయిష్టాలు, మమకారం, దేహభావన ఇవిఅన్నీ తగ్గిస్తాడు, మనస్సును బంగారంలాగ చేస్తాడు. అయితే బంగారంలాంటి మనస్సు ఇమ్మని మనం భగవంతుడిని ప్రార్థించనక్కరలేదు. మనం ప్రార్థిస్తూ ఉంటే మనకు ఏది మంచిదో ఆయనకు తెలుసుకాబట్టి అది ఇచ్చి ఊరుకుంటాడు. అయితే మనకు ఏదిమంచిదో మనకంటే భగవంతుడికే ఎక్కువ తెలుసు అన్నసంగతి మనకు తెలియటం లేదు అందుకే పిల్లిమొగ్గలు వేస్తున్నాము.

మనం నేను, నేను అంటున్నాము ఈ నేను దేహానికి పరిమితమై ఉంది, ఇంద్రియాలకు పరిమితమై ఉంది, గౌరవాలకు, అగౌరవాలకు పరిమితమై ఉంది, ఇలా కలుషితమైపోయి ఉంది, లోకంలో ఉన్న బాడిఅంతా అంటించుకొని ఉంది, ఇటువంటి నేనుకు ఏమి అడగాలో ఎలా తెలుస్తుంది. భగవంతుడి నామాన్ని స్మరిస్తూ ఉంటే, అలా స్మరించటం వలన పోయే దోషాలకు మించిన దోషాలు ఈ సృష్టిలో ఎవడూ చేయలేదు. అంటే నారాయణనామం,

శివనామం, రామనామం చేస్తూ ఉంటే ఎన్ని దోషాలు ఉన్నా అన్నీ కూడా కాలి బూడిద అయిపోతాయి. నారాయణ నామం కరిగించలేనంత దోషం ఏదీ లేదు. ఉప్పు నీటిలో ఎలా కరిగిపోతుందో అలాగ దోషాలు అన్నీ కూడా భగవంతుడి నామంలో కరిగిపోతాయి. భగవంతుని స్మరణ విడిచిపెట్టవద్దు, స్మరణ వలన నీవు పవిత్రుడవు అవుతావు. భగవంతుడి యొక్క శక్తి ఇట్టిది అని మన హ్యూమన్ బ్రెయిన్‌కు అందదు. ఇక్కడ కమిటీవారు మంచి పనులు చేస్తున్నారు. వీరందరిచేత ఈమంచిపనులు ఒక మహత్తరశక్తి చేయించి గౌరవం వీరికి ఇస్తోంది. ఇది గ్రహించినవారు ధన్యులు. మీలో ఏదైనా మంచితనం ఉన్నా, ఏదైనా వైభవం ఉన్నా అవి మీవి కాదు, భగవంతుడివే. కాని ఇవిఅన్నీ మేము కష్టపడి సంపాదించుకొన్నాము అని మీరు అనుకొంటే బురదలో పడతారు, ఏదీ మనది కాదు. మన దేహప్రారబ్ధాన్ని బట్టి 60 గాని 70 సంవత్సరాలు బతకవచ్చు, ఈ ప్రపంచం వయస్సు కొన్ని కోట్ల సంవత్సరాలు. అందులో మన వయస్సు ఎంత? ఏంచూసి మనం మురిసి పోతున్నాము. మీరు పని చెయ్యండి, లోపల అనురాగం వద్దు. అలాగని పని విడిచిపెట్టవద్దు. పని మనిషిని బంధించదు, మమకారం బంధిస్తుంది. ఏ జీవుడికి కర్తృత్వబుద్ధిని నేను కల్పించలేదు, నేనే కర్తను అని వారు కల్పించుకొంటున్నారు. వారు కల్పించుకొన్న దానిని తొలగించటానికి నేను ప్రయత్నం చేస్తూఉంటే వారు సహకరిస్తే సరిపోతుంది అని పరమాత్మ చెపుతున్నాడు. ఇప్పడు మీకు ఏదైనా దుఃఖం వస్తూ ఉంటే దేవుడు ఇలా చేసాడు, అలా చేసాడు అంటారు. ఎవరైనా నిందిస్తే కుంగిపోమని, ఎవరైనా పొగిడితే సంతోషించమని దేవుడు చెప్పాడా? ఇవి అన్నీ ఉద్రేకాలు, ఇది భక్తి కాదు. ఇవి అన్నీ రజోగుణానికి సంబంధించిన విషయాలు. ఇక్కడ మీరు ఒకటి అర్థం చేసుకోండి. మనకు దుఃఖ కారణం ఉన్నా దుఃఖం లేకుండా ఉన్నాము అనుకోండి, కోప కారణం ఉన్నా కోపం లేకుండా ఉన్నాము అనుకోండి. ఏదైనా బాధపడే కారణం ఉన్నా బాధ లేకుండా ప్రశాంతంగా ఉన్నాము అనుకోండి అప్పడు ఈశ్వరుడు దయను మనమీద కురిపిస్తాడు. ఎవరైతే నీ మొఖాన్ని భక్తివైపుకు తిప్పి, నీకు ముక్తిని ప్రసాదిస్తారో వారితో సహవాసం చెయ్యి. ఏదో అరటిపండు అరచేతిలో పెట్టినట్లు నీకు మోక్షం ఇచ్చేస్తాను అంటే ఇటువంటి ఆడంబరమైన మాటలలో, ఆకర్షణలలో పడవద్దు, మీకు పరిచయం లేని వ్యక్తులతో చాలా జాగ్రత్తగా ఉండండి. ఎవరైనా మనకు మాట చెపుతారు అనుకోండి, ఆ మాట మన క్షేమం కోరి చెపుతున్నారా, మనలను ఏదైనా మాయ చెయ్యటానికి చెపుతున్నారా, ఆ మాటల వలన మనకు ఏదైనా ఉపయోగం ఉందా లేక అవి కాలక్షేపం కోసం చెప్పే మాటలా అని నువ్వు విచారణ చేసి వాటిని విడదీసుకో. భగవంతుడి శక్తి ఇట్టిది అని మనకు తెలిస్తే ఆయనను మనం ప్రార్థిస్తాము. ఒక మనిషికి గొప్ప తెలివి ఉంది అనుకోండి, ఒక మనిషికి పెద్ద అధికారం ఉంది అనుకోండి, ఒక మనిషికి బాగా

ధనం ఉంది అనుకోండి, భగవంతుడికి తెలియకుండా ఇవి ఏమీ రావటానికి వీలు లేదు. ఉపనిషత్‌లలో చెపుతారు ఒకసారి వాయుదేవునికి గర్వం వచ్చిందట. నేను పెద్ద పెద్ద చెట్లను కూడా పడగొట్టగలను అనుకొన్నాడు. అప్పుడు బ్రహ్మం ఒక రూపం ధరించి వచ్చి వాయుదేవుడిని పిలిచింది. ఒక గడ్డిపరకను అక్కడ పెట్టి కదపమన్నాడు. వాయుదేవుడిలో ఉన్న శక్తి ఎవరు భగవంతుడే కదా! ముందు ఆ శక్తిని లాగేసి గడ్డిపరకను కదుపు అన్నాడు. ఇంక వాయుదేవుడికి గడ్డిపరక కదిపే శక్తి కూడా లేదు. నా పొగరు అణగిపోయింది, ఇంక పడిఉంటాను, నా శక్తిని నాకు ఇచ్చేయండి అని వాయుదేవుడు అడిగాడు. వాయుదేవుడే కాదు మనమయినా అంతే. మనలో ఉన్న శక్తిని ఉపసంహరిస్తే మనం శవం అయిపోతాము, ఏనుగు కూడా పీనుగు అయిపోతుంది. మంచి పనులు చెయ్యటం కంటే మంచిగా ఉండటం ఇంకా ఎక్కువ కష్టం అని శాస్త్రంలో చెప్పారు. నీకు శక్తి ఉంటే మంచి పనులు చేస్తావు లేకపోతే చెయ్యలేవు, అది కాదు పరమాత్మ అనేవాడు ఒకడు ఉన్నాడు అనే పరిపూర్ణ మైన విశ్వాసం కనుక నీకు ఉంటే ఆయన స్వరూపం నీకు లభ్యమవుతుంది. ఒకసారి భగవాన్‌తో ఒక భక్తుడు మాట్లాడుతూ నాకు మోక్షానికి తొందరలేదు, వెయ్యిజన్మల తరువాత వచ్చినా పరవాలేదు కాని అంతవరకు మీరే నాకు గురువుగా ఉండాలి అన్నాడు, అది విశ్వాసం. శాస్త్రజ్ఞానం కంటే, ఈ లోకానికి సంబంధించిన ఐశ్వర్యం కంటే, రచనలు, ప్రవచనముల కంటే పరమాత్మ పట్ల పూర్ణమైనవిశ్వాసం ఉన్నవాడికి కృతనిశ్చయం కలుగుతుంది. వాడి నిశ్చయమే వాడిని తొందరగా బాగుచేస్తుంది. కోటిపుణ్యాలు చేసిన వారికంటే వీడు ముందు ముక్తుడవుతాడు. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే నిశ్చయం కలగటం మన నోటితో చెప్పకొన్నంత తేలికగా రాదు. పరమపవిత్రుడికి కాని ఆ నిశ్చయం రాదు. ఒకవేళ నీవు పుణ్యకర్మలు చేయకపోయినా ఆ నిశ్చయం కనుక నీకు ఉంటే చాలు నీవు బాగుపడతావు. ఆ విశ్వాసం కొండలను కూడా ఛేధించుకొంటూ వెళుతుంది, అంటే పరమాత్మ అనుగ్రహిం చాడు అంటే అంతా కొన్ని క్షణాలలో జరిగిపోతుంది. ఆచార్యులవారి దగ్గర నలుగురు శిష్యులు ఉండేవారు. అందులో తోటకాచార్యులు ఆచార్యులవారి బట్టలు ఉతికే వాడు, ఆయనకు ఎప్పుడు ఏది కావాలో ఆయన అడగకుండానే తెచ్చి ఇచ్చేవాడు. గుడిలో ఉన్న శివుడు స్థిరం, ఈయన చరం అనుకొనేవాడు. ఒకసారి తోటకాచార్యులు ఆచార్యులవారి బట్టలు ఉతుకు తున్నాడు. మిగిలిన ముగ్గురు ఆచార్యులవారి దగ్గర పాఠానికి కూర్చొన్నారు. ఆచార్యులవారు తోటకాచార్యునికోసం చూస్తున్నారు. మిగిలిన ముగ్గురు ఏమన్నారు అంటే వాడు వచ్చి విన్నా, వాడికి సరిగా అర్థం కాదు, అందుచేత వాడికోసం మా టైము పాడుచేయటం ఎందుకు? అన్నారు. వారి ఆక్షేపణ తోటకాచార్యుల మీద దయకింద మారిపోయింది. అందుకే పడ్డవారు ఎప్పడూ చెడ్డవారు కాదు, వారు అదృష్టవంతులు అవుతారు అని చెపుతారు.

ఆచార్యులవారి అనుగ్రహం వలన మిగిలిన ముగ్గురికి అర్థంకాని కవిత్వం చెప్పకొంటూ వచ్చి కూర్చొన్నాడు, వారు ముగ్గురు నివ్వెరపోయారు. ఆచార్యులవారి అనుగ్రహం వలన తోటకాచార్యుడు మహాపండితుడు అయిపోయాడు. జీవితం పొడుగునా కృషి చేసినా సంపాదించలేని కవిత్వం, పాండిత్యం ఆ సాహిత్యం కొన్ని క్షణాలలో వచ్చేసింది. నీకు సత్‌పురుషులతో సహవాసం చేయాలనే బుద్ధి కలుగుతూ ఉంటే ఇంక ఇతర నియమాలు పెద్ద అవసరం లేదు. ఎప్పడయినా మనం శారీరకంగా, మానసికంగా అలిసిపోయాము అనుకోండి ఒక మహాత్ముడి సమక్షంలో కూర్చుంటే అయిదు నిమిషాలలో ఫ్రెష్‌గా అయిపోతాము, కొత్తజన్మ వచ్చినట్లు మనకు అనిపిస్తుంది, ఆయన దగ్గర నుండి వచ్చే వైబ్రేషన్స్ అలా పనిచేస్తాయి. శాంతి తరంగాలను, కాంతి తరంగాలను ఇవ్వాలని వారు అనుకోరు, వారి ద్వారా శక్తి తరంగాలు, కాంతి తరంగాలు ప్రవహిస్తూ ఉంటాయి. ఎందుచేత నంటే వారు అనుగ్రహస్వరూపులు. మామూలుగా మనం ఎవరిమీద అయినా దయ చూపిస్తే వారికి కొంత డబ్బు ఇస్తే వారి దారిద్ర్యం పోవచ్చుకాని దక్షిణామూర్తి కనుక మన మీద దయచూపిస్తే దారిద్ర్యం పోతుంది, అజ్ఞానం పోతుంది. దక్షిణామూర్తి సాక్షాత్తు శివుడే అని కొంతమంది చెపుతారు. ఆయనే ఆత్మవిద్యను నోటితో చెప్పలేనప్పడు మనం ఎలా చెప్పగలము, అది అనుభవైక వేద్యం. భగవంతుడికి శరీరంతో పనిలేదు. మన కోసం ఒక శరీరం ధరించి టీచింగ్‌కోసం నోరు పెట్టుకొంటాడు. మనతో మాట్లాడుతూ ఉంటాడు, మనతో కలిసి తిరుగుతూ ఉంటాడు. కాని మనలను ఎక్కడికి తీసుకొని పోవాలో ఆయన మరచిపోడు. ఎక్కువ పరిచయం వలన ఆయన కూడా మనలాంటివాడే అని మనం అనుకొంటూ ఉంటాము. మనం దేహధారులం కాబట్టి, దేహానికి పరిమితమై ఉన్నాము కాబట్టి భగవంతుడిని కూడా ఆ దేహానికి పరిమితం చేస్తాము. మనం ప్రతిమలను పూజించవచ్చు, నదులలో మునగవచ్చు, గుడులు చుట్టూ తిరగవచ్చు ఇవన్నీ కూడా మహాత్ముల సాంగత్యంతోటి సమానం కానే కాదు. సాధువు అంటే కాషాయ బట్టలు వేసుకొన్నవాడు అని కాదు, సాధువు అంటే సత్పురుషుడు. వాడు నిన్ను పవిత్రుడిని చేస్తాడు, వాడి సన్నిధి మనకు పెన్నిధి. వాడి మాటలతో పనిలేదు వాడి సన్నిధే మనకు సరిపోతుంది. వారు చేసేది కూడా మౌనంలోనే చేసేస్తారు. మహాత్ములను సరదాగా చూడటానికి కొంతమంది వెళుతూ ఉంటారు. సరదాగా చూసినా మంచిదే. మనం సరదాగా నిప్ప మీద చేయి వేసినా కాలుతుంది, అలాగే మహాత్ములను సరదాకు చూసినా వారి చూపు ఊరికే పోదు. ఒకడికి సిగరెట్ కాల్చే అలవాటు ఉంది. భగవాన్ కొండదిగి వస్తూ ఉంటే ఎదురుగా సిగరెట్ కాలుస్తున్నాడు. ప్రక్కన ఉన్నవారు వద్దని చెపుతున్నారు కాని వాడు వినటం లేదు, కొండ మీద ఎందుకు కాల్చకూడదు అంటున్నాడు. భగవాన్ చూస్తూ ఉన్నా వాడు ప్రక్కకు తప్పకోలేదు, ఆయనే ప్రక్కకు తప్పకొని

వెళ్ళిపోతూ మరల వాడివంక చూసి నీ తలంపును చూస్తున్నాను అన్నట్లు నవ్వారు. మరుసటి రోజు నుండి వాడికి సిగరెట్ కాల్చే అలవాటు పోయింది, అది దేవుని అనుగ్రహం, అది మహాత్ములు చేసే పని. నువ్వు సిగరెట్ మానెయ్యి అని ఆయన చెప్పలేదు, చేసేటప్పుడు ఇంక చెప్పటం ఎందుకు? నువ్వు అలవాటు మానెయ్యి అని చెప్పటం ఎందుకు? ఆ శక్తి వాడికి లేనప్పడు, ఆ శక్తిని నీవు ఇవ్వాలి అలవాటు పోవటానికి అనేవారు. ఆ అలవాటు కంటే ఎక్కువ ఆధ్యాత్మికశక్తిని పొందినప్పడు అలవాటులో నుండి బయటకు వస్తాడు, వాడి శక్తి సరిపోదు అనుకోండి అలవాటుకు బానిస అవుతాడు.

ఎవడయితే హృదయంలో ఉన్న సత్యవస్తువు యొక్క అనుభవాన్ని పొంది ఉన్నాడో వాడు ఎక్కడ కూర్చొన్నా పరవాలేదు. వాడు ప్రసంగాలు చేయనక్కరలేదు, వ్రాతలు రాయనక్కర లేదు, వాడి ద్వారా శాంతి అందరికీ అందుతూనే ఉంటుంది. అక్కడ జ్ఞానం ముఖ్యం కాని ప్రసంగాలు చేయటం, రచనలు చేయటం ఇవన్నీ కూడా సెకండరీ. నామరూపముల దగ్గరే మన బుద్ధి ఆగిపోతోంది. జ్ఞానగంగ మన హృదయంలో ఉంది. ఈ రూపబుద్ధిలో నుండి, నామబుద్ధిలోనుండి నీవు విడుదల పొందితేగాని జ్ఞానగంగలో ఐక్యం కాలేవు. జ్ఞానితో మాట్లాడేటప్పడు ఎంత పండితుడు అయినా బోర్లా పడిపోతాడు. రామకృష్ణుడిని ఒకసారి ఈశ్వరచంద్రవిద్యాసాగరుడి దగ్గరకు తీసుకొని వెళ్ళారు. ఈయన ఏదో చదువు లేనివాడి కింద విద్యాసాగరుడికి కనిపించాడు, తీరా దిగితే లోతు దొరకదు, మునిగిపోతాడు. ఈయన విద్యాసాగరుడు అని రామకృష్ణుడికి పరిచయం చేసారు. అప్పడు రామకృష్ణుడు అన్నాడు ఇంత వరకు బోదెలు చూసాను, కాలవలు చూసాను, నదులు చూసాను ఇప్పడు సముద్రాన్ని చూస్తున్నాను అన్నాడు. సముద్రంలో ఏముంది లెండి ఉప్ప ఉంటుంది అన్నాడు విద్యాసాగరుడు. ఈరోజు నేను ఉప్ప సముద్రాన్ని చూడటం లేదు, విద్యా సముద్రాన్ని చూస్తున్నాను అన్నాడు రామకృష్ణుడు. అంతే ఆయన బిగిసిపోయాడు, అంత పండితుడు కూడా బోర్లాపడిపోయాడు, ఇంక ఆయనకు మాట రాలేదు. జ్ఞాని దగ్గర మాట్లాడటం కష్టం. మన వారిని పొగిడినా పట్టించుకోరు, నిందించినా పట్టించుకోరు. చంటి పిల్లలను మనం ఎత్తుకొంటాము, ఒకోసారి మన మీద మల విసర్జన చేస్తారు, మనలను కాళ్ళతో తన్నుతూ ఉంటారు అయినా మనం ఏమీ పట్టించుకోము, జ్ఞానికి మన మాటలు కూడా అంతే, వాటిని ఆయన ఏమీ పట్టించుకోడు. మన వినయాన్ని విడిచిపెట్టకూడదు. నీకు అన్నీ కలిసివస్తున్నాయి అనుకో అప్పడు కూడా నీ మొఖంలో అవినయం రానీయకు. ఈ సంపదలను చూసి అవినయం తెచ్చుకొంటే సంపదలు ఇక్కడ ఆగిపోతాయి, అవినయం నీ కూడా వస్తుంది. మీరు ఐశ్వర్య వంతులు అయినా మీ ఐశ్వర్యం మీకు లోకువగా

ఉండాలి కాని మీ శిరస్సు మీద ఉండకూడదు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నీవు కష్టపడి సాధన చేసి ఏ అలవాట్లలో నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేసి ఫెయిల్ అయ్యావో అటువంటి వాసనలు కూడా జ్ఞాని సమక్షంలో అణుగుతాయి, భస్మమయిపోతాయి. నీ హృదయంలో బండరాళ్ళ వంటి వాసనలు ఎన్ని ఉన్నప్పటికీ గురువు యొక్క దయ అనే ప్రవాహంలో అవి ఎంత బరువైనవి అయినప్పటికీ చాలా తేలికగా గడ్డిపరకలాగ కొట్టుకొని పోతాయి. ఈశ్వరుడు జడ్జిమెంట్ రాసేస్తాడు, కాని గురువు జడ్జిమెంట్ చెప్పడు. నీకు భగవదనుభవం కలుగకుండా ఏవైతే అడ్డు వస్తున్నాయో చూస్తాడు, వాటిని తొలగించటానికి చూస్తాడు, ఒకసారి నీ మీద కోపం ప్రదర్శిస్తాడు, ఆయన ఏ స్థితిని అయితే పొంది ఉన్నాడో అక్కడకు నిన్ను తీసుకొని పోవటానికి నీకు తెలియకుండానే అనేక పనులు చేస్తూ ఉంటాడు, నీలో ఉన్న బలహీనతలను తొలగించటానికి గురువు కొన్ని సంఘటనలు క్రియేట్ చేస్తూ ఉంటాడు. అటువంటి ఏర్పాట్లు అన్నీ చేసి ఆ బలహీనతలను తొలగించటమే కాదు, నీ హృదయంలో ఉన్న సత్య వస్తువును నీకు అనుభవంలోనికి తీసుకొని వస్తాడు, ఇదంతా గురువు చేసుకొని పోతూ ఉంటాడు. ఆచార్యుల వారు టీచింగ్‌కు ప్రథమస్థానం ఇచ్చారు, టీచింగ్‌కు మించిన సేవ లేదు అని చెప్పారు. ఎందుచేతనంటే టీచింగు వలన జీవుడు అజ్ఞానంలో నుండి బయటకు వస్తాడు. గురుస్థానం కొంత మందికే ఉంటుంది. గురువు గోడమీద కూర్చొంటాడు. అటువైపు బ్రహ్మంలో ఉరికేయకుండా, మనలను ఆ స్థితికి తీసుకొని వెళ్ళటంకోసం గోడమీద కూర్చొని అటువైపు చూస్తూ అక్కడ ఏముందో మనకు చెపుతూ ఉంటాడు. వాడు ఉరికేస్తే జ్ఞానసాగరంలో ఐక్యం అవ్వవచ్చు, కాని మనకోసం ఆ గోడమీద కూర్చొని ఉంటాడు. మనలను దుఃఖస్పర్శలేని స్థితికి తీసుకొని వెళ్ళటం ఒక్క గురువుకేసాధ్యం. మీకు సర్వసంపదలు ఉన్నాయి అనుకోండి, దుఃఖం వస్తోంది అనుకోండి, ఏమీ ప్రయోజనం లేదు. మీరు ఆత్మజ్ఞానం గురించి శ్రవణం చేస్తే ఎప్పడో ఒకప్పడు మీ జీవితంలో అది సపోర్టుగా నిలబడుతుంది. మనిషి అయ్యాక జీవితంలో కష్టం వస్తూ ఉంటుంది, మీరు శాస్త్రాన్ని శ్రవణం చేసి ఉంటే అప్పడు ఆ మాటలు మీకు సపోర్టుగా ఉంటాయి. అందుచేత మనం విసుగువచ్చేలా శ్రవణం చెయ్యాలి. ఆచార్యులవారు గంటల తరబడి బోధించేవారు, ఆ బోధలోనే చాలామటుకు తీసుకొని పోవాలని ఆయన ఉద్దేశ్యం.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 02-03-05, సఖినేటిపల్లి)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజున రాధాకృష్ణుల కళ్యాణ మహోత్సవాలు జరుగుతున్నాయి. రాధాకృష్ణులు మన కళ్ళకు చూడటానికి వేరుగా కనిపించినా, అంతర్దృష్టితో చూస్తే వారిద్దరూ ఒక్కటే.